అమ్మనే మధురమైన
అతివిలువైన పిలుపుకోసం
ఎదురుచూసిన
ఆమెకు ఏం జరిగింది?

గుంటక వెంకటేశ్వర రెడ్డి కథ

# అమ్మ

సరసరమని కాలిపోయే గుడిమెట్లపై పొనసారం పడిందొకావిడ. అరగంట గడచినా ఆమెలోరవ్వంతైనా మార్పు లేదు. ఆమె పూర్తి దీక్షలో నిమగ్నమయింది. నిప్పులుకక్కే సూర్యుడి ప్రతాపం వలన గాలి వేడెక్కివుంది. ఆ వేడిగాలి సెగలకు ఆమె శరీరంలోనుండి కారిన చెమట బిందువులు కలసి ఒక చిన్న కాలువలాగా మెట్లనుండి కిందకి దొర్లుతున్నాయి.

''అమ్మసుందరి'' ఆ కంఠంలో స్పష్టత, మృధుత్వం వుంది.

''లే...వమ్మ'' మళ్ళీ వినిపించిందామెకు ఆ కంఠం.

ఆశ్చర్యంగా కళ్ళు తెరచి చూచింది. ఎదురుగా స్వాములవారు మూర్తీభవించిన అతని ముఖతేజస్సు, కంఠ స్పష్టత, విశాల ఛాతి, శాంత స్వభావమైన చక్కటి చిరునవ్వు, కాంతివంతమైన కళ్ళు, ఆహా... ఈసారితో నా జన్మ ధన్యమయింది. అని భావించి లేచి నిలబడింది.

''ఏమ్మా... నీకు సంతానం కావాలి అంతేనా'' అని అడిగాడు.

''నీ కోటానుకోట్ల ఆస్తిని అనుభవించడానికి మీ వృద్ధాప్యంలో మిమ్మల్ని కనిపెట్టుకోవడానికి, నీవు సంతానవతిగా నిరూపించుకోవడానికి, నీకొక శిశువు కావాలి... అందుకే నీ ... ఈ ప్రయాసం'' చెప్పేడు స్వామి. ఆమెకళ్ళు ఆశ్చర్యంగా చూశాయి. అవును తన గురించి ఇతనికేమి తెలుసు, ఎలా తెలుసుకోగలిగాడు. ఇతను నిజంగా స్వామికాడుగదా ఆలోచించుకుంటుందామె.

''నాకు నీ గురించి ఇంకా చాలా



విషయాలు తెలుసమ్మా'' స్వామి అన్న ఆ మాటలకి ఆమె గతుక్కుమంది. ఏమిటి నేను మనసులో అనుకునే మాటలుకూడా ఇతనికి ఎలా తెలుస్తున్నాయి. ఆమె ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది.

''కంగారుపడకమ్మా నేను సంసారిక జీవితాన్ని తెగించి సన్యాసంలో మానవసేవ చేసుకొనుచున్నవాడిని. అంతేకాదు పక్షిగా

టిలోనుండి జారి కిందపడ్డ పిల్ల పక్షులనెన్నింటినో చేరదీసి వాటికి రెక్కలొచ్చేంతవరకు సంరక్షిస్తూ ఈ జీవితాన్ని గడుపుతున్నాను. నా ఆశ్రమంలో దారం తెగి ఆధారం లేకుండా వేలాడే ఎన్నో గాలిపటాలకు ఆధారం కల్పించబడి ఆనందంగా ఎగురుతూ కన్పిస్తాయి. ఇదంతా నీకెందుకు చెపుతున్నాననా! బిడ్డ ప్రేమకోసమై, బిడ్డ 'అమ్మ' అనే మధురమైన అతి విలువైన పిలుపుకోసమై ఎదురుచూస్తున్న దానవు కనుక నా ఆశ్రమం ఈ కాలుష్య వాతావరణానికి చాలాదూరం... రాదలచుకుంటే ఇదిగో చిరునామా'' స్వామి ఆమెకు చిరునామా కాగితం అందించి గుడిమెట్లు దిగి వెళ్తున్నాడు. అతని నడకలో తొందరపాటు గాని, పరుగుకాని లేదు. ప్రశాంతమైన సముద్రపు ప్రవాహంలాగా వుంది. దేవసుందరి స్వామివారివైపు చూస్తూ వుండిపోయింది. కొన్ని నిమిషాలు గడిచాయి. స్వామివారు కనుచూపులమేరకు అందనంత దూరం వెళ్ళిపోయారు.


క్రితం రోజు జరిగిన సంఘటన గుర్తుచేసుకుంటోంది దేవసుందరి. స్వామివారిచ్చిన చిరునామా మరోసారి చూసుకుంటుంది. ఆమె ఆలోచనలో స్వాములవారి ఆశ్రమం మెదిలింది. తను ఆ ఆశ్రమానికి వెళితే తనకి స్వాములవారి మహిమచేత బిడ్డని ప్రసాదించగలడు. ఈ లోకం తనపై నిలిపిన నింద (గొడ్రాలు) పోతుంది. నా లక్షల ఆస్తికి వారసుడు దక్కుతాడు. తనని అమ్మా అనే అతి విలువైన, మధురమైన బిడ్డపిలుపు లభ్యమవుతుంది. ఆమె ఊహల్లో ఉన్న తృప్తి అనుభవించి ఆశ్రమంకై క్షణంలో అశ్వరథంపై ప్రయాణం కట్టించింది. భర్త పైసలయ్యతోసహా. పైసలయ్య మన భారతంలోని భీముడిలాగా కండలు తిరిగిన శరీరం, కోరమీసాలు, గుత్తంగా లతల్లాగా అల్లుకుపోయిన జుట్టు. అతన్ని చూస్తే 'మగాడంటే అలా' అనిపించేలా వుంటాడు. పైసలయ్య అంటే ఆ ఊరిలోవారందరికి మంచి గౌరవం, భయం వుంది. ఆ ఊరిలో ఎక్కడైనా ఏ విధమైన తగవులుగాని, గొడవలుగాని వస్తే అన్నింటిని తనే పరిష్కరిస్తాడు

దేవసుందరి, పైసలయ్యది గొప్ప ఆదర్శ దాంపత్యం. పైసలయ్యంటే దేవసుందరికి బియ్యంలో మట్టిపెల్లే ఊరిలో జనమంతా అతనిమాట విన్నా అతనుమాత్రం ఇంట్లో ఆమె మాట వినాల్సిందే. వాళ్ళ పూర్వీకులు సంపాదించిన లక్షల ఆస్తిని కోట్లలోకి మార్చాడు. కాని ఆ పెద్ద దివాణంలాంటి బంగళాలో తిరగడానికి నౌకర్లు, యజమానులైన పైసలయ్య సుందరి తప్ప ఒక పిల్లాపాపాకూడా లేకపోవడంతో ఆ భవంతి అంతా దివలాగా కనిపిస్తుంది. అందుకే దేవసుందరి ప్రయాసం కనిపిస్తుంది. తన కడుపున ఒక బిడ్డ పుట్టాలని తనని'అమ్మ' అని పిలిపించుకోవాలని కోరిక. కోరికకు మించిన అన్ని ప్రయత్నాలు చేస్తుంది. ఎందరో దేవుళ్ళకు మొక్కుకుంది. మరెందరో దేవతలకు నమస్కరించింది. పచ్చని చెట్టుకి రాళ్ళమూటలు కడితే పిల్లలు పుడతారంటే కనిపించిన ప్రతిచెట్టుకి రాళ్ళమూటలు కట్టింది. కాని ప్రయోజనంలేదు. అయినా ఆమెలో విసుగుపుట్టలేదు. ఆ లక్షా పది ప్రయత్నాల్లో

ఇదొక ప్రయత్నం.

బండి తోలుతున్న నర్సిగాడు బండి ఆపాడు. అనుకున్నచోటు రావడంతో పైసలయ్య బండిలోనుండి దూకాడు. నర్సిగాడు ఎత్తుపీటవేసి పట్టుకుంటే దేవసుందరి బండిలోనుండి దిగింది. "రామ్మా నా ఆశ్రమానికి వచ్చినందుకు ధన్యవాదములు" ఎదురుగా ప్రత్యక్షమైన స్వామివారు లోపలకు ఆహ్వానించారు. ఆశ్రమం అంతా కలియదిప్పుతూ వాటిగురించి వివరించి చెపుతుంటే స్వామి, ఆమె మనస్సు ఎంతో ఆనందంతో నిండిపోయింది. ఒకప్రక్క పాఠశాల... మన పాఠశాలలుగా పెద్ద పెద్ద బిల్డింగ్‌లలోకాదు. చెట్ల నీడలోనే ఉపాధ్యాయులు బోధిస్తుంటే విద్యార్థులు అభ్యసిస్తున్నారు. అచ్చం మన రవీంద్రనాథ్ ఠాగూర్ పాఠశాలలాగా వున్నాయి. వయసొచ్చి వృద్ధాప్యంలో మగ్గుతున్న వృద్ధులు, మరో పక్క హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు... చూస్తూ దేవసుందరి శిశుభవనంలోకి అడుగుపెట్టింది. అంతకుమునుపే అక్కడికి చేరిన పైసలయ్య, నర్సిగాడు ముచ్చటించుకుంటున్నారు. ఆ మందిరంలో వందల సంఖ్యలో పిల్లలు నవ్వుతూ కేరింతలు కొడుతూ చిన్న చిన్న తప్పటడుగులు వేస్తూ, చిలిపి చేష్టలెన్నో ముద్దుగా చేస్తూ కనిపించేసరికి ఆమెలోని తల్లి మనస్సు పొంగుకొచ్చి ఒక పాపను తీసుకుని హృదయానికి హత్తుకుంది.

"చిన్నపిల్లలు దైవసమానులు. వీళ్ళలో ఎలాంటి పాపములేదు. నిర్మల మనస్కులు వీళ్ళ జన్మకారకులెవరో అర్థంకాని ఒక ప్రశ్న. అయినా నా పోషణలో పెరుగుతున్నారుకాబట్టి వీళ్ళ చిరునామా మాత్రం నా ఆశ్రమందే అవుతుంది. కాని వీళ్ళలో ఎవరైనా సరే నిన్ను "అమ్మా" అని పిలువతగును అని నీ మనసు అంగీకరిస్తే నిర్భయంగా ఒక శిశువును స్వీకరించు" స్వామి మాటలకు దేవసుందరి ఉరుమువలె ఉలికిపడింది. 'స్వామి' ఆలోచన అనాలోచనంగావే అంది. ఆ క్షణంలో ఆమెకు



స్వామివారు దేవుడిలాగా చిరునవ్వు నవ్వుతూ కనిపించాడు. ఆమె అందుకున్న బిడ్డను మరింత గట్టిగా హృదయానికి హత్తుకుంది. ప్రేమగా ముద్దాడింది. ఆమెకు ఆ సంతోషంలో కనులవెంబడి ఆనందభాష్పాలు రాలాయి.

''ఏమిటి సుందరీ నీ నిర్ణయం'' భర్త ఆసక్తిగా అడిగాడు. అప్పుడు ఆమె ఈ లోకానికి వచ్చింది. క్షణం ఆలోచించుకుంది. ఆమె ఎత్తుకున్న బిడ్డను దింపుతూ మరోసారి ముద్దాడింది. ఎందుకో ఎంత కావాలనుకుంటున్నా మనస్సు అంగీకరించడంలేదు. ''నీ మనస్సు పూర్తిగా అంగీకరించడంలేదని నేను గ్రహించానమ్మా'' అన్న స్వామివారి మాటలు సూదుల్లై ఆమెకు గుండెల్లో గుచ్చుకున్నట్లనిపించింది. ''తొందరలేదు సరైన నిర్ణయం ఆలోచించుకుని తీసుకోండి'' స్వామి అక్కడినుండి రెండడుగులు ముందుకేస్తూ అన్నాడు.

''స్వామి ఇక నేను వెళ్ళొస్తాను'' పైసలయ్య సెలవు తీసుకుంటూ అన్నాడు.

''మంచిది నా ఆశీస్సులెప్పుడు మీతోనే వుంటాయి'' స్వామివారు దీవించి వెళ్ళిపోయారు.

పైసలయ్య బండెక్కి కూర్చున్నాడు. నర్సిగాడు ఎత్తుపీటవేసి పట్టుకుంటే దేవసుందరి వచ్చి బండెక్కి కూర్చుంది. ఆమె బండెక్కి కూర్చున్నదేగాని ఏదో విలువైనది పోగొట్టుకున్నట్లు మనస్సు చిత్రహింసలు పెడుతుంటే భర్త గుండెలమీద తలవాల్చి కళ్ళు గట్టిగా మూసుకుంది.

''అమ్మగారూ సాములోరి ఆశ్రమానికి వెళ్ళివచ్చారంటగదా సామివారు ఏటి చెప్పారు? ఆ సామివారు చాన గొప్పోళ్ళని నేను విన్నానులె, మొన్న మా ఇంటి పక్కోళ్ళు ఎల్లిండ్రడట. ఆయన దేవునిపూజ చేయడంట! మనుషుల సేవే దేవుని సేవగా భావించి దిక్కులేనోళ్ళని చేరదీసి ఆదరిత్తాడంటగదా'

సుబ్బులు ప్రశ్నించి అడుగుతుంటే సుందరిలో ఆలోచన మొదలైంది. ఏమిటి తను సామివారి ఆశ్రమానికి వెళ్ళినా తెలియని విషయం సుబ్బులు చెపుతుంది. అంటే దైవారాధన కాదా చేసేది. మానవసేవే మాధవసేవగాభావించి అనాథలను చేరదీసి సేవ చేస్తున్నాడా, ఎంత ఉన్నతమైన ఆశయం ఆదర్శం.

''ఏంటమ్మగారూ చెప్పరే మా పెద్దయ్యకూడా ఆడనే బతుకుతున్నాడు. ఆడిని ముసలితనంలో చూడక ఎళ్ళగొడితే కొడుకులు సాములోరి ఆశ్రమానికి పోయిండట'' చెపుతూనే ఏడుస్తుంది సుబ్బులు.

''సుబ్బులూ ఏడుస్తున్నావెందుకు. నీకు కనిపించినా నాకు కనిపించలేదు. నా అంతస్తులు, ఆస్తులు ఇవి నన్ను ఆయన్ని చూడనివ్వలేదు'' బాధగా చెప్పింది.

''అమ్మగారు ఎవరో బాపళ్ళట మీకోసం వచ్చారు'' నర్సిగాడు చెప్పాడు.

''ఎందుకు. రమ్మను'' ఆలోచించుకుంటూనే అన్నది. మరుక్షణంలోనే వచ్చాడతను. ఇరవై సంవత్సరాలుంటాయి. సాధువేషం. అతనితోపాటు రెండేళ్ళ పసిపాపదుకూడా వచ్చాడు. ''నమస్కారమమ్మా మమ్మల్ని బాపళ్ళు అంటారు'' పరిచయం చేసుకున్నాడు. తను ''మేము సామి సంతానందులవారి


శిష్యులం. మీరు వారిగురించి వినే వుంటారు. సంతానం లేనివాళ్ళకెందరికో సంతానం ప్రసాదించాడు. మా సామి అసులు సంతానం ప్రసాదించే యోగ్యత ఆయనకు మాత్రమే వుంది. ఆయనే మమ్మల్ని మీ దగ్గరకు పంపించాడు'' వినయంగా చెప్పాడు పెద్దబాపడు. మింగుడుపడని ముద్ద మింగుతున్నట్లు అడిగింది 'ఎందుకు' అని దేవసుందరి.

''తమరు సంతానంకోసం ప్రయాసపడుతున్నారని, మీకు అసలు సంతానయోగ్యం వుంది. కాకపోతే గ్రహకష్టలవలన మీకు సంతానం కలగడంలేదు. గ్రహదోషం వుంది. అందుకనే ముందు గ్రహదోషం పోవడానికి గ్రహపూజ జరిపించాలి. తరువాత బాలపూజ చేయాలి. ఇందుకు మీనుండి మేమేమీ ప్రతిఫలం ఆశించి మీకు ఈ మాటలు చెప్పడంలేదు. మీకు ఇష్టమైతేనే పూజ ప్రారంభించుదాము''

దేవసుందరినుండి ఏ జవాబు రాలేదు. రెండు నిమిషాలు గడచిన తరువాత ''వెళ్ళొస్తానమ్మా నీకు నమ్మకం కలిగినట్టు లేదు'' అని చిన్నబాపడు అన్నాడు.

''ఆ సరే కానియ్యండి అమ్మగారు'' సుబ్బులు అమ్మగారికి వాళ్ళ తరపున సపోర్ట్ చేసింది. దేవసుందరి సుముఖతగానే హూ అంది దానితో బాపళ్ళు ఇద్దరూ స్నానం చేసి మడికట్టుతో పూజలో కూర్చున్నారు. పిల్లబాపడు స్పష్టంగా మంత్రపఠనం చేస్తుంటే దేవసుందరి మురిసిపోతుంది. ముందు నవగ్రహపూజకు కావలసిన వస్తువులను సిద్ధం చేశారు. దేవసుందరిని నవగ్రహ విగ్రహాల ముందు కూర్చోబెట్టి పూజ చేస్తున్నాడు. పిల్లబాపడు పద్మాసనం వేసి కూర్చుని బాపడు చెప్పిన మంత్రాన్ని తూచ తప్పకుండా పలుకుతుంది దేవసుందరి.

పెద్దబాపడు విగ్రహాలచుట్టూ ప్రదక్షణలు చేస్తున్నాడు. సుబ్బుల్ని మాత్రం వీధిగుమ్మంవద్ద కాపలగా వుంచారు లోపలకు ఎవరూ రాకుండా వుండడానికి. ఎవరన్నా లోపలకు వస్తే పూజకు భంగం కలుగుతుంది. అపుడు మనం చేసిన ప్రయత్నం వ్యర్థమని చెప్పి వాళ్ళు ఇంకా ఏవేవో పూజలు చేస్తున్నారు. వాళ్ళు చెప్పినట్లుగా చేస్తుంది దేవసుందరి.



పొద్దును చీకటిపక్షి మింగిందనుకుంటూ నిశీధి పడగవిప్పి ఆడుతుంది. దేవసుందరి ఏ లోకంలోనుండో లేచి మరలా భూలోకానికి వచ్చినట్టు మగతగా లేచింది. తనను తానే నమ్మలేక కళ్ళు నలుపుకుని చూసింది. ఏమిటి ఇంతవరకు జరిగింది నిజంగా నిజమేనా, కలా తనచుట్టూ చూసింది. కొన్ని విగ్రహాలు, పూజాపరికరాలు అక్కడున్నాయి. అయితే నిజమేనని నిశ్చయించుకుంది. మరైతే ఈ బాపళ్ళు ఎక్కడంటూ చూసింది. కాని ఎక్కడా కనిపించలేదు. సుబ్బులు మాత్రం వీధిగుమ్మం దగ్గరే పడుకుని వుంది. అంటే సుబ్బులు ఇంకా ఈ లోకానికి రాలేదన్నమాట. సుందరి సుబ్బుల్ని తట్టి లేపేసరికి తుళ్ళిపడి గావుకేక వేస్తూ లేచింది. దేవసుందరికి పరిస్థితి ఇంకా అర్థంకాలేదు. అంతా పిచ్చిగావుంది.

''అమ్మగారు... మీ మెడలో...''సుబ్బులు మాట ఆశ్చర్యంగా మింగేసింది. సుందరికి అప్పటికి గుర్తుకురాలేదు. మెడలోవున్న 20 కాసుల చమంతకహారం 10 చిన్నాల రుక్మిణి గొలుసు, చేతులకి ఉన్న గాజులు మాయమయ్యాయని, ఆమె ఆ షాకులోనుండి తేరుకోలేక చస్తుంటే ఆమెలోకి విద్యుద్ఘటంలాగా ప్రవేశించింది.

''అమ్మగారూ. బీరువా అంతా ఖాళీ'' అన్న సుబ్బులు మాటలు. ఏమి చెయ్యాలో అర్థంగాక కింద కుప్పగా కూలిపోయింది. దేవసుందరి ఏంటి ఆ బాపళ్ళు తనను ఇంతగా మోసం చేశారు? ఎంత తలబాదుకున్నా ఆ ప్రశ్నకు బదులు దొరకలేదు. రాత్రి 9 గంటలు అయినా ఆ ఇంట్లో లైట్లు వెలిగించలేదు. రోజూ మూసివుంచే తలుపులన్నీ తెరచి వున్నాయి. సుబ్బులు ఆ పరిస్థితి తెలిసి ఆమె ఎలా వదలి వెళ్ళగలదు. వెళ్ళలేకపోయింది. సుబ్బులు ఆ ఇంట్లో పనిమనిషి అయినా సొంత మనిషిలాగనే వుంటుంది. తనమీద పడకూడని అభాండం ఏదైనా పడుతుందేమోనని తెగ చస్తుంది. నర్సిగాడు అదే భయంతో పిచ్చెక్కినట్టు అటు ఇటు తిరుగుతున్నాడు. వాడు 20 సంవత్సరాలనుండి ఆ ఇంట్లోనే ఏదో పనిచేస్తూ తన జీవితాన్ని గడుపుతున్నాడు. ఈ సంఘటనవల్ల తనమీద ఏదైనా అభాండం

పడుతుందేమోనన్న భయం వాడిలో నాటుకుపోయింది. దేవసుందరిలో మాత్రం ఇక చలనం కనిపించలేదు. సుబ్బు నర్సిగాడిని పిలిచి అయ్యగారిదగ్గరకు పంపించింది. అప్పటికే ఆ వార్తను ఎలా పసిగట్టారో ఇరుగుపొరుగువారంతా ఆ ఇంటికి వచ్చేశారు


చూస్తుంటే అది అసెంబ్లీ హాలులాగా తయారైంది. కొందరు పరామర్శించడానికైతే, మరికొందరు చూసి చప్పట్లు కొట్టడానికి వచ్చినవాళ్ళైతే, ఇంకొందరు ఎగతాళి చెయ్యడానికి పసిగట్టి వచ్చినవాళ్ళు కొందరు. దేవసుందరికి స్పృహ వచ్చినా స్పృహరానట్లే పడుకుంది. ఆమె చెవులకి వినిపిస్తున్న కొన్ని ఘోరమైన మాటలకు తట్టుకుని ''భలే మంచిపనిచేశారు వెధవలు ఈసారితోగాని

ఈవిడ తిక్క వదలదు, బిచ్చగాడు వాకిట్లోకి రాకముందే గేటు వేయించిద్ది. కాని దేవుళ్ళకి, గుళ్ళకి బాగానే ఖర్చుచేసిద్ది. అందుకే ఈసారి తగిన శాస్తి జరిగింది''

ఎన్నో ఎత్తుపొడుపుమాటలు ఆమెగుండె

ల్లోకి ఈ పెల్లాగా గుచ్చుకుంటుంటే లోలో న కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది. అలాగే... పరామర్శించడానికి వచ్చినవాళ్ళు, చూసి చప్పట్లు కొట్టడానికి వచ్చినవాళ్ళు, ఎగతాళి చేయడానికి వచ్చినవాళ్ళు, ఒక్కొక్కళ్ళు మెల్లగా జారుకున్నారు. పైసలయ్య ఇంటికి వచ్చేసరికి రాత్రి 12 గంటలు అయింది. పైసలయ్యకు ముందే విషయం తెలిసి భార్యను ఓదార్చుతున్నాడు. దేవసుందరి భర్త ఔదార్యానికి మనసులోనే కృతజ్ఞత చెప్పుకుంది.

‘‘సుందరీ నువ్వు మోసపోయింది ఈ ఒక్కసారిమాత్రమేకాదు. నీకు కనిపించిన ప్రతిగుడిలో దేవుడికి వేలసంఖ్యలో కానుకలు వేసిన ప్రతిసారీ, నీకు కనిపించిన చెట్టు, పుట్ట, రాయి, రప్పకి మొక్కిన ప్రతిసారీ నువ్వు మోసపోతున్నావు. దేవుడు లేడనికా దు మనిషికి ఒక దేవుడి పూజ మాత్రమే ప్రధానంకాదు సుందరి. ఆకలేసిన బిచ్చగా డు అమ్మా ఒక ముద్ద అన్నం పెట్టమ్మా అని అడిగినపుడు వాడిని, వాడి దరిద్రాన్ని చీదరించుకుంటూ గేటు బయటకు గెంటే స్తాము. ఇది ధర్మంకాదని మనకు అనిపించ దు. ఎందుకంటే మనకు ఆకలిబాధ తెలియ దు గనుక రాళ్ళలోను, విగ్రహాలలోను మాత్రమే మనకు దేవుళ్ళు కనిపిస్తారు. వాటికి మొక్కుతాము. వందలుకాకపోతే వేలుకూడా ఇస్తాము. ఈ నామాటలలోనిస త్యం నీకు అర్థమైతే చాలు సుందరి. ఈ సమాజంలో ఉన్న సామాన్యులు చావుబతు కులలో వుండి మన సహాయంకోసం చేయిచా చి అడిగినపుడు మనం వాడికి సహాయం చెయ్యగలిగినపుడు మనకు నిజమైన పరమా ర్థం లభిస్తుంది. ఈ దేశంలో ఉన్న ఎందరో అభాగ్యులకు కొందరికైనా ఒక బతుకు మార్గం చూపించినపుడు మనకు నిజమైన ఆత్మసంతృప్తి లభిస్తుంది. సుందరి పగటివేష గాళ్ళను, మోసగాళ్ళను నమ్మి మోసపోయేక న్నా అవమానం మరొకటి వుంటుందా. వాళ్ళు దోచుకుపోయినందుకు నేను బాధప డడంలేదు. ఎందుకంటే పోయిన సొమ్మును తిరిగి సంపాదించగలను. కాని వాళ్ళు దోచు



కుపోయింది సొమ్మేకాదు. మన పరువు ప్రతిష్టకూడా పోయింది. పలానవాళ్ళ ఇంట్లో ఇలా జరిగిందంటే మనకు ఎంత నామోషి'' భర్త చెప్పిన మాటల్లో నిజం తనను కొట్టొచ్చినట్లనిపించింది దేవసుందరికి. అవును చీకటినే పిచ్చిగా వెలుగని నమ్మి మోసపోయాను. అప్పుడు స్వామి ఈ బిడ్డ నీ బిడ్డని చెప్పినపుడు మనసు అంగీకరించలేదు. ఎవరో కనిపారేసిన బిడ్డను తన బిడ్డగా తన వారసత్వాన్ని పంచిస్తే ఈ సమాజంలో నవ్వులపాలవుతుందని మనసు అంగీకరించలేకపోయింది. మనస్సు అప్పుడు చీకటిపొరల లో నాకు చీకటే కనిపించింది తప్ప వెలుగు కనిపించలేదు. అనాధ బిడ్డను నా బిడ్డగా పెంచుకుంటే మన ఔదార్యాన్ని మెచ్చుకుంటుంది తప్ప... ఈ నకిలీ మనుష్యులను నమ్మి అమాయకంగా మోసపోయేకంటే, మోసపోయి నలుగురిలో నవ్వులపాలయ్యేకంటే అనాధబిడ్డను తన బిడ్డగా పెంచుకుంటే తప్పేమిటి. ఒక అనాదకు ఆశ్రయం కలిగించినందుకు మేలు కలుగుతుంది. తల్లినయ్యేటందుకు తహతహలాడే నాకు బిడ్డ దక్కుతాడు. అందుకే మళ్ళీ స్వామి ఆశ్రమానికి వెళ్ళి బిడ్డను పొందాలి అని నిర్ణయించుకుని దేవసుందరి నర్సిగాడిని బండి కట్టమని అంది. ''ఎక్కడికి ఇంత అర్ధరాత్రి'' అడిగాడు పైసలయ్య. ''స్వామి ఆశ్రమానికి'' బదులుపలికింది. మళ్ళీ మాట్లాడలేదు పైసలయ్య. నర్సిగాడు బండికట్టాడు. పైసలయ్య, దేవసుందరి బండెక్కి కూర్చుంటే బండి కదిలింది. ఆమెకు బిడ్డ 'అమ్మ' అనే తియ్యని పిలుపు మాత్రమే వినిపిస్తుంది. ఆ తియ్యని పిలుపుకోసమే ఎన్నో వ్యర్థమైన ప్రయత్నాలు చేసి అవమానం పాలైపోయి ఇపుడు ఆ పిలుపును అందుకునేటందుకు సరైన నిర్ణయం తీసుకుంది. అందుకే ఆమె ఎంతో ఆనందంగా ఉంది. పైసలయ్యకు దేవసుందరిలో నిండుతనం కనిపిస్తుంది. ఆమెలో ఆమె తీసుకున్న నిర్ణయాన్ని తెలుసుకోగలిగాడు. గాఢాందకారాన్ని బ్రద్దలు కొట్టుకుని సుందరి ముందున్న పండువెన్నెల్ని చూస్తుంది. అవును ప్రతిమనిషి ఆలోచనలు చీకటిని చీల్చుకుంటూ వెలుగులోకి వెళ్ళాలి. అప్పుడు నిజమైన లోకం స్పష్టంగా కనిపిస్తుంది. కన్నులకు ఆలోచనలకన్నా బండి వేగంగా ఉరుకుతుంది స్వామివారి ఆశ్రమానికై... *

